క్లుప్తంగా

తక్షణమే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్ కోరారు. ఈ మేరకు కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశమై, మాట్లాడారు. జిల్లాలో ఎస్సీఏ, ఏహెచ్‌ఎస్‌ఏ అలవెన్సులు.. రెవెన్యూ గ్రామాల్లో పనిచేస్తున్న వారికే వస్తున్నాయి తప్ప మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వారికి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నిచోట్ల పనిచేస్తున్న వారికీ ఈ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబరు 3వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.కృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియంలోని వస్తువులు పోతుంటే పట్టించుకోరా?

సీతంపేట: స్థానిక పాత పీఎంఆర్‌సీ సెంటర్‌లో ఉన్న గిరిజన మ్యూజియంలోని వస్తువులు ఒక్కొక్కటిగా పోతుంటే ఐటీడీఏ అధికార యంత్రాంగం పట్టించుకోదా అని గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు, పి.సాంబయ్య ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు మ్యూజియం నిర్మాణానికి ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు విలువ చేసే ఏసీ, విద్యుత్ పరికరాలు దోచుకుపోతుంటే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తగదన్నారు. వెంటనే దీనిపై విచారణ చేయించాలని కోరారు. అలాగే ఆగిపోయిన పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు.

'పొలం పిలుస్తోంది'

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి, కన్నపుదొరవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏవో జ్యోత్స్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏ రకమైన నేలలో ఏ పంట వేస్తే అధిక దిగుబడులు వస్తాయి అనే విషయాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఆయా గ్రామాల్లోని అరటి, వరి పంటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త అమృతవీణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో విజయపార్వతి సూచించారు. మండలంలోని నీలకంఠాపురం, మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఆయా ఆస్పత్రుల రికార్డులతో పాటు అక్కడి రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరూ సమయానికి విధులకు హాజరై, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారి అభినవ్ తదితరులు ఉన్నారు.

అనుమతులు తప్పనిసరి

కొమరాడ: దీపావళి మందుగుండు సామగ్రి అమ్మకాలకు సంబంధించి, అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నీలకంఠం హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎక్కడైనా అధిక ధరలకు టపాసులు విక్రయిస్తే తెలియజేయాలన్నారు. జనావాసాలకు దూరంగా మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ఫైర్ సేఫ్టీ విధానాలు పాటించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో దీపావళి వేడుకలు చేసుకోవాలని కోరారు.

మత్తుపదార్థాలతో ఆరోగ్యం చిత్తు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మద్యం, ఖైనీ, గుట్కా, గంజాయి, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం అంధకారంగా మారుతుందని హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. మత్తుపదార్థాల వినియోగంతో ఆరోగ్యం పాడువుతుందని, సమాజంలో మీపట్ల ఉన్న గౌరవం పోతుందని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి చైతన్య ర్యాలీ చేశారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: హడ్డుబంగి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం సందర్శించారు. 'మై స్కూల్ మై ప్రైడ్' కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో మమేకమై వారిని బృందాలుగా విభజించి, వాటికి దేశ నాయకుల పేర్లు పెట్టారు. ఆదర్శ కార్యక్రమాలు చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. ప్రతీ నాలుగవ శనివారం పాఠశాలను సందర్శిస్తానని అన్నారు. ఆమె వెంట హెచ్‌ఎం ఉమారాణి, టీచర్లు ఉన్నారు.



● శీతాకాలం..

రోగాలకు అనుకూలం



ఏరియా ఆస్పత్రిలో పిల్లలకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రవీంద్రకుమార్

● సీజనల్ వ్యాధులతో పాటు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం
● జాగ్రత్తలు పాటించకుంటే తప్పని సమస్యలు

పాలకొండ రూరల్:

శీతాకాలం వచ్చేసింది. వాతావరణం చల్లబడటంతో పాటు ఎంతో ఆహ్లాదంగా మారిపోయింది. అయితే ఈ సీజన్‌లో సరైన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులు పంజా విసిరే అవకాశం ఉంది. తేమతో కూడిన వాతావరణం, చల్లదనం కారణంగా దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాపింపచేస్తాయి. పొగమంచు వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

అలసత్వం వహిస్తే ప్రాణాపాయం

ఈ కాలంలో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలి. లేదంటే డెంగీ, మలేరియా, స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకరం వ్యాధులతో పాటు గజ్జి, తామర వంటి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మలేరియా, డెంగ్యూ లక్షణాలు దాదాపు ఒకేలా ఉండడంతో వాటిని గుర్తించడంలో ఏ మాత్రం అలసత్వం జరిగినా ప్రాణహాని తప్పదు. ఈ తరహా వ్యాధులు సోకినట్టు గుర్తిస్తే దానికి సంబంధించి నివారణ కూడా వైద్యులు పేర్కొంటున్నారు. నోటిద్వారా లేదా సెలైన్ ద్వారా ఇంట్రావీనస్ రీహైడ్రేషన్, ఇంగ్రీవినెస్ ఫ్లూయిడ్స్ అందించాల్సి ఉంటుందని చెపుతున్నారు. వ్యాధి లక్షణాలు కనిపించినప్పుడు సాధారణ ఆహారం ఎక్కువగా తీసుకోవాలని, దీంట్లో భాగంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, వేడినీరు, గ్లూకోజ్, కొబ్బరినీరు, బార్లీ వంటి ద్రవ పదార్థాలు మేలుచేకూరుస్తాయంటున్నారు. ప్రజలు ప్రస్తుత సీజన్‌లో వైద్యుల సూచనలు పాటించాలని పేర్కొంటున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

ప్రస్తుతం పట్టణాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణను అధికారులు, పాలకులు గాలికొదిలేశారు. మురుగుకాలువల్లో పూడికలు పెరిగిపోయాయి. తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ ఊసేలేదు. రోడ్లపై చెత్తను పారబోయడం, బహిరంగ మలవిసర్జన వల్ల గ్రామాలు, పట్టణాలు మురుగుకూపాలుగా మారిపోతున్నాయి. దోమలు వృద్ధి చెందడంతో పాటు వ్యాధులనువ్యాపింపజేస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రజలు రోగాల పాలవుతున్నారు.



మురికి కూపంలా మారిన పట్టణ శివారు ప్రాంతం

అవగాహన పెంచుకోవాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వనరుల క్లోరినేషన్‌పై సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. నివాస ప్రాంతాలను, ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. అనారోగ్య లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. గర్భిణులు, బాలింతలు, చంటి పిల్లలు, వృద్ధులు చల్లని గాలులకు దూరంగా ఉండాలి. బాలింతలు శరీరానికి ఉష్ణాన్ని అందించే దుస్తులు వాడుకోవాలి. చిన్నపిల్లల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలి. – జి.నాగభూషణరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

సంఘటిత పోరాటాలే సరైన మార్గం



మాట్లాడుతున్న యూసీసీఆర్ఐఎంఎల్ అధ్యక్షుడు పట్నాయక్

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న గిరిజన వ్యతిరేక చర్యలను తిప్పికొట్టేందుకు సంఘటిత పోరాటాలే సరైన మార్గమని యూసీసీఆర్ఐఎంఎల్ అధ్యక్షుడు బీవీఎన్ పట్నాయక్, ఎఫ్ఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ ఎస్.ఎన్.మూర్తి, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ కార్యదర్శి ఏఎస్ నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో యూసీసీఆర్ఐఎంఎల్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం గిరిజనోద్యమంలో ప్రథమ అమరులైన కామ్రేడ్లు కోరన్న, మంగన్నల సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. వారు ఈ సభకు హాజరై, కోరన్న, మంగన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కాసేపు ప్రసంగించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేస్తూ 1967 అక్టోబరు 31వ తేదీన భూస్వాముల చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న కోరన్న, మంగన్నల స్ఫూర్తితో అప్పట్లోనే 400 మంది కార్యకర్తలు, నాయకులు హింసకు గురై అమరులయ్యారని తెలిపారు. వారందరి ప్రాణత్యాగ ఫలితాలు, తదనంతరం కొనసాగించిన పోరాటాల ద్వారానే ఏఎల్‌టీఆర్, 1 /70 చట్టాలు అమలు చేయబడ్డాయన్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని వ్యతిరేక చర్యల ద్వారా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి మనమంతా సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన నవోదయ సాంస్కృతిక సంస్థ కళాకారులు చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సభలో యూసీసీఆర్ఐఎంఎల్ నాయకులు వై.లక్ష్మీనారాయణ, ఉర్లక త్రినాథ్, నిమ్మక వాసుదేవరావు, గౌడు రెల్లి, సవర తెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం

● మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి వారిని మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబుకు అలవాటని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విమర్శించారు. మండలంలోని పసుకుడిలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్ బెవరా భార్గవనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పప్పల ప్రవీణ్‌తో కలిసి మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా చంద్రబాబునాయుడు ఇచ్చిన ఎన్నికల హామీలను బుట్టదాఖలు చేశారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని, సూపర్ సిక్స్ అని చెప్పి ఆరు రకాలు ధరలను పెంచి ప్రజలను దోచుకుతింటున్నారని దుమ్మెత్తిపోశారు. నియోజకవర్గంలోని సమస్యలు పట్టించుకోకుండా ఇసుక దందాలు నడుపుతున్న కూటమి నాయకుల తీరును ఎండగట్టారు. సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధింపుగా ఇష్టానుసారం బదిలీలు చేసి కార్యాలయాలు ఖాళీ చేశారని ఆరోపించారు. టీడీపీ కూటమి నాయకుల స్వార్థానికి అధికారులను బలి చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాగితాపల్లి కృష్ణారావు, వలరౌతు వెంకటరమణ, గెల్లంకి రమేష్, కొత్తకోట ఆంజనేయులు, బొడ్డేపల్లి ప్రసాద్, పత్తిక సింహాచలం, బెవరా మన్మథరావు, కార్యకర్తలున్నారు.

డ్వామా పీడీని రిలీవ్ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: బదిలీ అయిన పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ రామచంద్రరావును తక్షణమే రిలీవ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. బదిలీ అయిన సదరు అధికారిణి ఇప్పటివరకు రిలీవ్ చేయకపోతే ఎందుకు బదిలీ చేసినట్లు అని ప్రశ్నించారు. బదిలీ చేసిన అధికారిని అలాగే ఖాళీగా ఉంచడం సరికాదన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సును ప్రారంభించామని, నిరుద్యోగ యువత ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఐటీఐ పనివేళల్లో వచ్చి సీటు పొందాలని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణా తరగతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 7981308986ను సంప్రదించాలని తెలిపారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

సీతంపేట: మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 దిబ్బ సూర్యచంద్రరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటలను రుచి చూశారు. పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 3,4,5 తరగతులకు వెళ్లి విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం సవర ప్రసాద్, ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు ఉన్నారు.

చోడి దిగుబడి లెక్కింపు

భామిని: మండలంలోని బొడ్డగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి సాగు విధానంలో పండించిన చోడిపంటను వెలుగు సిబ్బంది మంగళవారం పరిశీలించారు. పంట కోత ప్రయోగాలు చేపట్టి దిగుబడిని లెక్కించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో సాగుచేసి ఎక్కువ దిగుబడి సాధించినట్లు రిసోర్స్ పర్సన్ పి.నాగేశ్వరరావు వివరించారు. ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనీ అంబోజీ, భామిని వ్యవసాయ సహాయకుడు ఎర్రన్న, ఐసీఆర్‌పీలు, వెలుగు సిబ్బంది, గిరిజన రైతులు ఉన్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరించడం తగదు

● మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల మండిపాటు



సమావేశంలో వైద్యాధికారిని నిలదీస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రజాప్రతినిధులు, ప్రజలు తీర్మానం చేసిన అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు(సర్పంచ్‌లు, ఎంపీటీసీలు)కు తెలియకుండా వెండర్లకు అప్పగిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తారా అని ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ శాఖల అధికారుల తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఈ పద్ధతి తగదని ఖండించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఉపాధి హామీ పథకం అభివృద్ధి నివేదికల ప్రస్తావన వచ్చినప్పుడు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలుగజేసుకుని, గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి కనీస సమాచారం తమకు ఇవ్వకుండా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ వెండర్లు(కాంట్రాక్టర్లు)కు పనులు అప్పగించడం సరికాదని నిలదీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అన్ని రకాల అభివృద్ధి పనులు చట్ట ప్రకారం సర్పంచ్ ఆధ్వర్యంలోనే చేపట్టాలని కానీ అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తుండడం ప్రజాప్రతినిధులను అగౌరవపరచడమేనన్నారు. వైద్య శాఖ సమీక్షలో ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల జియ్యమ్మవలస మండలం, చినమేరంగి సీహెచ్‌సీలో పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్ విధులకు రాకపోయినా అటెండెన్స్ వేసి మరీ జీతాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అది క్షమించరాని నేరమని, విధులకు రాని వ్యక్తికి జీతం వేయడం ప్రజాధనం దుర్వినియోగం చేయడం కాదా నిలదీశారు. భద్రగిరి సీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆస్పత్రిలో విధులకు హాజరవుతున్నానంటూ అటెండెన్స్ వేసుకుని, ఎమ్మెల్యే జగదీశ్వరి ఇంట్లో ఇన్నాళ్లు ఎలా పనిచేశారని.. ఇప్పుడు నిధుల దుర్వినియోగం అవ్వలేదా అని అడిగారు. భద్రగిరి సీహెచ్‌సీలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గత సమావేశంలో తీర్మానం చేసిన జరిగిందని, అయినా ఆయా పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం విచారకరమన్నారు. రాబోయే సమావేశంలోగా ఆయా పనులు పూర్తి కావాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఎంపీటీసీ సభ్యుడు ఎం.రమణ స్పష్టం చేశారు. సర్పంచ్‌లు కృష్ణారావు, శంకరరావులు మాట్లాడుతూ మలేరియా జ్వరంతో ఆస్పత్రికి వెళ్తే ఇక్కడ మందులు లేవు.. బయట కొనుక్కోవాలని వైద్య సిబ్బంది చెబుతున్నారని ఇదేనా ప్రభుత్వ వైద్యమని ప్రశ్నించారు. విద్యార్థుల అపార్ నమోదును ప్రోత్సహించాలని ఎంఈవో బి.చంద్రశేఖర్ ప్రజాప్రతినిధులను కోరారు. అనంతరం శాఖల వారీగా అధికారులు తమ అభివృద్ధి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు మండంగి రాజిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దారు ఎన్.శేఖర్ పాల్గొన్నారు.

కొమరాడ: ర్యాలీలో విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు



నవంబరు 6న చలో కలెక్టరేట్



గుమ్మలక్ష్మీపురం: తహసీల్దారు కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి నవంబరు 6వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో ఎల్విన్‌పేట నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లోని రూ.3,480 కోట్ల విద్య, వసతిదీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై స్పష్టతనివ్వాలని, డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, పార్వతీపురం మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేస్తున్నట్లు వివరించారు. నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు కలెక్టరు కార్యాలయాల వద్ద దీక్షలు చేపడతామన్నారు. అనంతరం తహసీల్దారు ఎన్.శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.శివ, ఎ.మహేష్, బి.జీవన్, గిరీష్, రాజేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కలిసి మంగళవారం ర్యాలీ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు డేవిడ్ మాట్లాడుతూ విద్యార్థుల వసతిగృహాల్లో వార్డెన్, ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన ర్యాలీ



వీరఘట్టంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పట్టణంలోని జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు హెచ్.సింహాచలం మాట్లాడుతూ.. విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, డిగ్రీలో మేజర్, మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని, తల్లికి వందనం, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలని, మండల కేంద్రంలో బాలబాలికలకు వేరువేరుగా హాస్టల్స్ నిర్మించాలని కోరారు. విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 27 నుంచి 30 వరకు అన్ని మండలాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వచ్చే నెల 2 నుంచి 4 వరకు కలెక్టరేట్‌ల వద్ద దీక్షలు, నవంబరు 6న చలో కలెక్టరేట్ చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు జి.సురేష్, మండల నాయకులు ఎస్.రాజు, ఎ.బాలు, దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం



పత్తి పంటలోని అంతర పంటలను పరిశీలిస్తున్న జీవ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ప్రబోధ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: అంతర పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని జీవ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.ప్రబోధ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దొరజమ్ము, రేగిడి గ్రామాల్లో నాబార్డు ఆర్థికసాయంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలో వేసిన అంతర పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఒకే విస్తీర్ణంలో పలు పంటలు వేసుకోవడం వల్ల జీవవైవిధ్యం పెరిగి, నేల సారవంతమవుతుందన్నారు. ఫలితంగా అక్కడ పండించే పంటలు తెగుళ్లు, చీడపీడలు తట్టుకుంటాయన్నారు. ఆయన వెంట జట్టు కో-ఆర్డినేటర్ జి.మురళీమోహన్, రైతులు తదితరులు ఉన్నారు.

గిరిజనులపై బైండోవర్ కేసులు ఆపాలి



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగునాయుడు

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస గిరిజనులపై పెడుతున్న బైండోవర్ కేసులు ఆపాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 19-2ఎ, 61, 62, 63లలో తలగాపు జగన్నాథం, రథాల దొర, దాడిచిలకల అర్జున్‌దొర, సోములమ్మలకు 2.26 ఎకరాల భూమికి సంబంధించి, 2007లో ప్రభుత్వం డీ పట్టాలు మంజూరు చేసిందని, అప్పటి నుంచి వారు ఆ భూమిని సాగుచేస్తున్నారని వివరించారు. అయితే అదే భూమిని కాజేయడానికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి మరీ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన ప్రయత్నాన్ని అడ్డుకుంటున్న గిరిజనులకు లాయర్ నోటీసులు పంపించి, పోలీసు కేసులు పెట్టడం వంటివి చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గిరిజనులకు తగిన న్యాయం చేయాలని లేకపోతే న్యాయపోరాటానికి దిగుతామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా నాయకుడు కూరంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే యూటీఎఫ్ లక్ష్యం

వీరఘట్టం: విద్యారంగం సమస్యల పరిష్కారమే యూటీఎఫ్ లక్ష్యమని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బోనంగి దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు యూటీఎఫ్ పాటుపడుతోందన్నారు. నవంబర్ 3న పార్వతీపురంలో జరగనున్న జిల్లా స్వర్ణోత్సవాలకు ఉపాధ్యాయులందరూ కుటుంబ సభ్యులతో హాజరుకావాలని కోరారు.

అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పీఆర్సీ కమిటీని పునఃసమీక్షించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఈఎంఆర్ఎస్‌లో సౌకర్యాల కల్పన



ఏకలవ్య స్కూల్‌లో రిగ్ యంత్రంతో బోర్లు తీస్తున్న దృశ్యం

భామిని: భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నూతన భవనాల్లో ప్రిన్సిపాల్ గంగాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం తరగతులు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు డెమె క్లాసులు నిర్వహించి ఎంపికలు చేపట్టారు. కొత్తూరు, మల్లి ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా సోమవారం భామిని ఏకలవ్య పాఠశాలలో చేరారు. అరకొర వసతుల మధ్యే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఐటీడీఏ ద్వారా మూడు తాగునీటి బోర్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, స్నానాల గదుల్లో ప్లంబింగ్ వర్క్స్ ఇంకా జరుగుతున్నాయి. మోటార్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు బకెట్లుతో నీరు తెచ్చి వాడుకున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనుల గుర్తింపు, తీర్మానంపై చర్చించారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి పనులు గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. సభలో సర్పంచ్ బి.అప్పలు, ఎంపీటీసీ కె.భరత్ తదితరులు పాల్గొన్నారు.